తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 23 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 110 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# ఎస్సీ ఎస్టీ సాధికారతకు ప్రభుత్వం కట్టుబాటు

అత్యాచార నిరోధక చట్టం అమలుపై ఉన్నతస్థాయి సమీక్ష

విద్య, ఉపాధితోనే సామాజిక మార్పు సాధ్యం

బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశం

రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేద్దామన్న ముఖ్యమంత్రి రేవంత్

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):**

దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి, సాధికారతను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ స్థాయి సమావేశం తొలిసారిగా నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంబంధిత మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై నమోదవుతున్న కేసుల పరిస్థితి, దర్యాప్తు పురోగతి, కోర్టుల్లో విచారణ స్థితి, బాధితులకు అందుతున్న నష్టపరిహారం, పునరావాస చర్యలు, చట్ట అమలులో ఎదురవుతున్న సమస్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. చట్టం అమలులో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు,

మిగతా 2 లో..




# ఎంజీఎం సమస్యలపై గళమెత్తిన వినయ్ భాస్కర్..

అడ్డుకున్న పోలీసులు

- ఆస్పత్రి పరిస్థితులు పరిశీలించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే
- పోలీసులతో తోపులాట.. వినయ్ భాస్కర్‌కు గాయాలు
- ఎంజీఎం సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్ డిమాండ్

**వరంగల్ టౌన్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో రోగుల భద్రత, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో మంగళవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది.



మిగతా 8 లో..

# తెలంగాణ వైభవానికి కొత్త ప్రతీకలు

- ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలపై సీఎం సమీక్ష
- ఢిల్లీ తెలంగాణ భవన్‌కు ప్రత్యేక రూపకల్పన

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)**

ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో నిర్మించనున్న తెలంగాణ భవన్ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, శిల్పకళలకు ప్రతీకలుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాలయాల వాస్తు, శిల్ప వైభవాన్ని అధ్యయనం చేసి వాటి స్ఫూర్తితో నిర్మాణాలను రూపొందించాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో

మిగతా 2 లో..



## మాదాపూర్ హోటల్లో యువతి మృతి మిస్టరీ

- ఓయో గదిలో అనుమానాస్పద ఘటన
- ముఖం, తలపై గాయాల గుర్తింపు
- ప్రియుడి కోసం పోలీసుల గాలింపు




2 లో..

## యాదాద్రి కొండపై మహిళ మృతి

- రోడ్డు ప్రమాదంలో ఈశ్వరమ్మ దుర్మరణం
- ఆలయ శుద్ధి వరకు దర్శనాలు నిలిపివేత

2 లో..



# రైతుల గోసలపై ఈటల విమర్శలు

* సాగునీరు విడుదల చేయాలని డిమాండ్
* ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలకు ముప్పు
* గోదావరి, కృష్ణా జలాల వినియోగంపై ఆందోళన

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)**

రాష్ట్రంలో రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డికి కేసీఆర్‌పై కోపం ఉంటే ఆయనపై తీర్చుకోవాలని, రైతులపై చూపవద్దని వ్యాఖ్యానించారు. రైతులు ఆందోళనలు చేస్తేనే నీళ్లు విడుదల చేసే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావం గురించి ముందుగానే హెచ్చరికలు వచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ భవన్‌లో రిటైర్డ్ ఇంజనీర్లతో సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్యాంప్రసాద్ రెడ్డి, వెంకటేష్, సత్తిరెడ్డి, విఠల్ రావు, ఇంద్రసేనా రెడ్డి, సాంబయ్య, కర్వందర్ తదితర ఇంజనీర్లతో రాష్ట్ర జల వనరుల పరిస్థితిపై చర్చించినట్లు తెలిపారు.



మిగతా 2 లో..



# రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై మంత్రి పరిశీలన

- శిశువుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- కుటుంబ సభ్యులకు మంత్రి భరోసా
- భద్రతా చర్యలపై అధికారులతో సమీక్ష

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగం (ఎస్ఎన్‌సీయూ)లో సోమవారం రాత్రి చోటుచేసుకున్న అగ్నిప్రమాదం నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజా నర్సింహ మంగళవారం ఆసుపత్రిని సందర్శించారు. ఘటన అనంతరం చేపట్టిన సహాయక చర్యలు,

మిగతా 2 లో..

# రబీ ప్రణాళికను ముందుగానే సిద్ధం చేయాలి



అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు

సాగునీరు, మౌలిక వసతులపై సమీక్ష

**ఖమ్మం, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం నియోజకవర్గంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతజౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ

మిగతా 2 లో..

# రామచందర్ రావు నిర్బంధంపై విమర్శలు

- జూరాల రైతులకు సంఘీభావం కోసం పర్యటన
- జడ్చర్ల వద్ద అడ్డుకున్న పోలీసులు.. బీజేపీ నేతల ఆగ్రహం వ్యక్తం



**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)**

జూరాల ప్రాజెక్టు వద్ద నీటి సమస్యపై ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును జడ్చర్ల వద్ద పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్న ఘటన రాజకీయ చర్చకు దారితీసింది. ఈ చర్యపై బీజేపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. బీజేపీ నాయకుల

మిగతా 2 లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మాదాపూర్ హోటల్లో యువతి మృతి మిస్టరీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** మాదాపూర్‌లోని ఓ ఓయో హోటల్‌లో యువతి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. విశాఖపట్నానికి చెందిన షారన్ నిఖిత టోప్నో (23) అనే యువతి తన స్నేహితుడు శ్రీనివాస రవితేజతో కలిసి హైదరాబాద్‌కు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరూ మాదాపూర్ సిద్ధిఖీ నగర్ రోడ్డు నంబర్ 5లో ఉన్న ఓ హోటల్‌లోని 303వ గదిలో దిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పోలీసుల వివరాల ప్రకారం, యువతిని ఆమెతో వచ్చిన వ్యక్తి మరియు హోటల్ సిబ్బంది కలిసి చికిత్స కోసం కొండాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అయితే ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు యువతి ముఖం, తలపై తీవ్ర గాయాలు మరియు వాపులు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. గాయాల స్వభావం, వాటికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతికి గల అసలు కారణాన్ని పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిర్ధారించనున్నట్లు పేర్కొన్నారు. యువతి మరణించిన విషయం తెలిసిన అనంతరం ఆమెతో వచ్చిన శ్రీనివాస రవితేజ ఆసుపత్రి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. ఆసుపత్రి సిబ్బంది దృష్టికి చిక్కకుండా అక్కడి నుంచి వెళ్లినట్లు ప్రాథమిక సమాచారం ఉందని పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.ఘటనకు సంబంధించి హోటల్ గదిని పరిశీలించిన పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు. గది గోడలపై, బెడ్ షీట్లపై రక్తపు మరకలు కనిపించినట్లు గుర్తించారు. హోటల్‌లోని నిఘా దృశ్యాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. అక్కడికి వచ్చిన వారి కదలికలు, గదిలో జరిగిన పరిణామాలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు మాదాపూర్ పోలీసులు తెలిపారు.

# యాదాద్రి కొండపై మహిళ మృతి

**యాదాద్రి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** యాదగిరిగుట్ట కొండపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందడంతో ఆలయంలో దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈశ్వరమ్మ అనే మహిళను ఓ కారు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గురైన మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం కొండపై వేగంగా దూసుకొచ్చిన కారు ఈశ్వరమ్మను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల దృశ్యాలు, ఇతర ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

ఆలయ నియమావళి ప్రకారం కొండపై మరణం సంభవించిన నేపథ్యంలో ఆలయ ద్వారాలను మూసివేశారు. భక్తుల దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసి ఆలయ అధికారులు శాస్త్రోక్త విధానాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం దర్శనాలను పునరుద్ధరించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కొంతసేపు ఆలయ పరిసరాల్లో విషాద వాతావరణం నెలకొంది.



# రామచందర్ రావు నిర్బంధంపై విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం, జూరాల ప్రాజెక్టు పరిధిలో నీటి కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను పరామర్శించి వారి సమస్యలు తెలుసుకునేందుకు రామచందర్ రావు పర్యటన చేపట్టారు. అయితే మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకుని ముందుకు వెళ్లకుండా నిరోధించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై స్పందించిన బీజేపీ నేతలు రైతుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్తున్న ప్రతిపక్ష నాయకుడిని అడ్డుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలపై స్పందించే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ చర్య అప్రజాస్వామికమని ఆరోపించారు. జూరాల ప్రాంత రైతులు సాగునీటి సమస్యలపై ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రాజెక్టులో నీటి లభ్యత, సాగునీటి పంపిణీ, రైతుల అవసరాలు వంటి అంశాలపై ఇప్పటికే వివిధ వర్గాలు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నాయి. రైతుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరమని స్థానికులు కోరుతున్నారు. రైతుల పక్షాన తాము నిలబడతామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు. అన్నదాతల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఉద్యమాలు, నిరసనలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో వెనక్కి తగ్గబోమని తెలిపారు. ఈ ఘటనపై అధికారుల నుంచి అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది. జూరాల ప్రాంతంలో నీటి సమస్యలు, రైతుల ఆందోళనలు, రాజకీయ పార్టీల స్పందనల మధ్య ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# ఎస్సీ ఎస్టీ సాధికారతకు ప్రభుత్వం కట్టుబాటు

(మొదటి పేజీ తరువాయి)

మొబైల్ కోర్టుల పనితీరు, జిల్లా స్థాయిలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, బాధితులకు అందుతున్న సేవలపై అధికారులు సమగ్ర నివేదికను సమర్పించారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో అట్రాసిటీ కేసులు క్రమంగా తగ్గుముఖం పట్టాయని అధికారులు వివరించినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇంకా ఘటనలు నమోదవుతున్నందున ప్రత్యేక దృష్టి అవసరమని అభిప్రాయపడ్డారు. కొన్ని జిల్లాల్లోని 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని అధికారుల నివేదికలో వెల్లడైంది. ఈ గ్రామాల్లో సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే అంశాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, సంక్షేమ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి సమస్యలను ప్రారంభ దశలోనే పరిష్కరించాలని ఆదేశించారు. అత్యాచార ఘటనలకు గురైన బాధితుల విషయంలో ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం, పునరావాసం, ఉపాధి, విద్యా సహాయం వంటి అంశాలు ఆలస్యం కాకుండా అందించాలన్నారు. ఇటీవల రాష్ట్రంలో చోటుచేసుకున్న కొన్ని కీలక ఘటనలను సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. చట్టంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచడం ద్వారా ఇటువంటి ఘటనలను నివారించవచ్చని అభిప్రాయపడ్డారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.దళితులు, గిరిజనులు, ఆదివాసీల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి కూడా ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధుల కేటాయింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని, గృహాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా సామాజిక, ఆర్థిక సాధికారతకు దోహదపడే కార్యక్రమాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో విద్యా అవకాశాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తోందన్నారు.అట్టడుగు వర్గాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై కూడా యువత దృష్టి సారించాలని సూచించారు. సమాజంలో అసమానతలు తగ్గాలంటే విద్యాభివృద్ధి అత్యవసరమని, ప్రతి కుటుంబం తమ పిల్లలను చదువులో ప్రోత్సహించాలని కోరారు.దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభ్యున్నతి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవనం ప్రతి పౌరుడి హక్కని గుర్తుచేశారు. వెనుకబడిన వర్గాల సాధికారత కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభివృద్ధి కోసం అవసరమైన అన్ని చర్యలను మరింత బలోపేతంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు.

# రబీ ప్రణాళికను ముందుగానే సిద్ధం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం పరిధిలోని అన్ని చెరువులను నింపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. బుగ్గవాగు ఎత్తిపోతల పథకం పనులను తక్షణమే ప్రారంభించి, బుగ్గవాగు నీటిని గ్రావిటీ ద్వారా కాలువలకు అందించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందించాలని స్పష్టం చేశారు.

మున్నేరు రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. డ్రైనేజీ డిజైన్లు, పునరావాస ప్యాకేజీ ప్రణాళికలను త్వరగా ఖరారు చేసి వచ్చే వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగునీరు, తాగునీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నీటి విడుదల సమయాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలని, లీకేజీల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.

ఖమ్మం నగరంలో కేబుల్ బ్రిడ్జి, రహదారుల విస్తరణ, మెడికల్ కళాశాల హాస్టల్, పరిపాలన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అక్టోబర్ నెల నుంచి అన్ని మంజూరైన పనులు ప్రారంభమయ్యేలా సెప్టెంబర్ చివరి నాటికి టెండర్లు, ఇతర ప్రక్రియలను పూర్తి చేయాలని సూచించారు. రహదారులపై ఆక్రమణలను తొలగించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. వచ్చే రబీ సీజన్‌కు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. నీటి లభ్యత, భూగర్భ జలాలు, విద్యుత్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి ఇతర పంటలను ప్రోత్సహించాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వెలుగుమట్ల కాలనీ అభివృద్ధి, సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు, విద్యుత్ మౌలిక వసతుల విస్తరణ వంటి పనులను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# తెలంగాణకు భారీ వర్షాల హెచ్చరిక

- **వాయుగుండం ప్రభావంతో రెండు రోజులు వర్షా లు**
- **ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**
- **అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం, బుధవారం రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. దీంతో జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో అతి భారీ వర్షాలు, మరో 20 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం రానున్న 12 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాలు ముందస్తు చర్యలు చేపడుతున్నాయి. విపత్తు నిర్వహణ బృందాలు, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ శాఖలను అప్రమత్తం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాల కారణంగా రవాణా, విద్యుత్ సరఫరా, వ్యవసాయ కార్యకలాపాలపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రజలు వాతావరణ శాఖ హెచ్చరికలను గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి ప్రవాహాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# తెలంగాణ వైభవానికి కొత్త ప్రతీకలు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ మేరకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యుత్ లైన్ల మార్పు, బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ మార్పిడి, తాగునీటి సరఫరా మార్గాల సర్దుబాటు, వాగుల ప్రవాహాల మళ్లింపు, రహదారుల విస్తరణ వంటి అంశాలపై సమగ్ర నివేదికను సమర్పించారు. ఈ వివరాలను పరిశీలించిన ముఖ్యమంత్రి పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు.

ప్రతి శాఖ విడివిడిగా పనులు చేపట్టడం వల్ల ఆలస్యాలు, అదనపు వ్యయాలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్న ముఖ్యమంత్రి, విద్యుత్, రహదారులు, తాగునీటి సరఫరా, నీటిపారుదల, సమాచార వ్యవస్థలకు సంబంధించిన శాఖలు ఒకే వేదికపై చర్చించి కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేయాలని, అభివృద్ధి పనులు సమగ్రంగా సాగాలని సూచించారు. విమానాశ్రయాల నిర్మాణ ప్రాంతాల్లో వాగులు, సహజ నీటి ప్రవాహాల మార్పు అవసరమైతే పర్యావరణ సమతుల్యతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అవసరమైతే విమానాశ్రయ ప్రాంగణం లేదా సమీప ప్రాంతాల్లో చెరువులను అభివృద్ధి చేసి, అక్కడి నుంచి నీటి ప్రవాహాలను మళ్లించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధి లక్ష్యాలను సమన్వయం చేయాలని చెప్పారు.

విమానాశ్రయాలకు చేరుకునే రహదారులు విశాలంగా ఉండేలా చూడాలని, జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులతో నేరుగా అనుసంధానం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆధునిక ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీ తెలంగాణ భవన్‌కు సంబంధించిన రూపకల్పన నమూనాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రతి నిర్మాణంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ కళా వైభవం ప్రతిబింబించేలా పలు మార్పులను సూచించారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, కిరణ్ చామల, విప్ బీర్ల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రిమ్స్ అగ్నిప్రమాద ఘటనపై మంత్రి పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

శిశువుల తరలింపు ప్రక్రియ, ప్రస్తుత పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే ఎస్ఎన్‌సీయూలో చికిత్స పొందుతున్న శిశువులను సురక్షితంగా ఇతర వార్డులకు తరలించిన విధానాన్ని మంత్రి పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది, అధికారులు సమన్వయంతో వ్యవహరించిన తీరును తెలుసుకున్నారు. శిశువుల భద్రతకు తీసుకున్న చర్యలపై వివరాలు సేకరించారు.

ప్రస్తుతం చికిత్స పొందుతున్న శిశువులు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని, ప్రతి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని వైద్య బృందాన్ని ఆదేశించారు. అవసరమైతే అదనపు వైద్య సదుపాయాలు కూడా కల్పించాలని సూచించారు. అగ్నిప్రమాదంతో ఆందోళనకు గురైన చిన్నారుల కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. శిశువుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఆసుపత్రిలోని అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, అత్యవసర పరిస్థితుల్లో అమలు చేసిన విధానాలను మంత్రి పరిశీలించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా ప్రమాణాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితర అధికారులు పాల్గొన్నారు. శిశువుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి దామోదర్ రాజా నర్సింహ స్పష్టం చేశారు.

# రైతుల గోసలపై ఈటల విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం మేడిగడ్డ వద్ద భారీగా నీరు సముద్రంలో కలుస్తున్నప్పటికీ ప్రభుత్వం వాటిని వినియోగించడంలో విఫలమైందన్నారు.

గోదావరి నదిలో ప్రస్తుతం నీటి మట్టం లిఫ్ట్ ఇరిగేషన్‌కు అనుకూల స్థాయిలో ఉన్నప్పటికీ నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టలేదని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఎన్డీఎస్ఏ నివేదిక కోసం ఎదురుచూశామని ప్రభుత్వం చెప్పినా, నివేదిక వచ్చిన తరువాత కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రైతులకు, ఇంజనీర్లకు ప్రభుత్వంపై ఎలాంటి ద్వేషం లేదని, కేవలం సాగునీరు అందించాలని మాత్రమే కోరుతున్నారని చెప్పారు. కృష్ణా నది జలాల పంపిణీ విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాయలసీమ ప్రాంతానికి భారీగా నీరు తరలిపోతుండగా, మహబూబ్‌నగర్ ప్రాంతంలో లక్షల ఎకరాల సాగుకు అవసరమైన నీరు అందడం లేదన్నారు. రైతులు కళ్ల ముందే నీళ్లు ఉన్నా వాటిని వినియోగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గోదావరి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోసి, కృష్ణా జలాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితిపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న సమయంలో ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదన్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో విద్యుత్ కోతలు ఎదురవుతున్నాయని, రైతులు మళ్లీ పాత కష్టకాలాన్ని గుర్తుచేసుకునే పరిస్థితి వస్తోందని వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ నెలలోనే పంటలు ఎండిపోతున్నాయనే వార్తలు వస్తున్నాయని చెప్పారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని ఈటల రాజేందర్ హెచ్చరించారు. ఉత్తర తెలంగాణను ఎండబెట్టే పరిస్థితి రాకుండా చూడాలని, హైదరాబాద్‌కు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సాగునీరు, విద్యుత్, జల వనరుల నిర్వహణ అంశాల్లో ప్రభుత్వం తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని, లేకపోతే రైతులు ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ నిరసనను మరింత ఉధృతం చేస్తారని పేర్కొన్నారు.

## ఆయుర్వేదంతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యం




- **డాక్టర్ స్వరూప**

**పెద్దమందడి,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):** ఆయుర్వేద డే సందర్భంగా పెద్దమందడి కస్తూర్బా పాఠశాలలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయుర్వేదం ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన జీవన విధానం, సహజ ఆహారం, యోగా, వ్యాయామంపై అవగాహన కల్పించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వరూప మాట్లాడుతూ.. భారతదేశ ప్రాచీన వైద్య విధానమైన ఆయుర్వేదం ఆరోగ్య పరిరక్షణలో విశిష్టమైన పాత్ర పోషిస్తోందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు సహజసిద్ధమైన ఆహారం తీసుకోవడం, యోగా, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. రోజువారీ జీవితంలో ఆయుర్వేద విధానాలను పాటించడం వల్ల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవచ్చని వివరించారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో యోగ వాక్ నిర్వహించారు. అనంతరం ఔషధ మొక్కల ఉపయోగాలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఆయుర్వేద విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఫార్మసిస్ట్ శశిధర్, యోగా ఇన్‌స్పెక్టర్లు నరేష్, స్వాతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమందడిలో బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్




**పెద్దమందడి,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు జూరాల ప్రాజెక్టు వద్దకు రానున్న నేపథ్యంలో పెద్దమందడి మండల బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సాగునీరు అందక రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు.జూరాల ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ ఆయకట్టు కాలువలకు సాగునీటిని విడుదల చేయకుండా తాగునీటి పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని చెన్నయ్య అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఉమ్మడి జిల్లాలోనే రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడని విమర్శించారు.రైతుల పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి ఆయకట్టు కాలువలకు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైతే రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ముందస్తుగా అరెస్ట్ అయిన వారిలో మండల ప్రధాన కార్యదర్శి సుక్క మధు, మండల ఉపాధ్యక్షులు సి. రవి, సీనియర్ నాయకులు కిషన్, హనుమంతు నాయక్, శంకర్, మోహన్ నాయక్, గణేష్ నాయక్, శివ శంకర్, మహేష్ తదితరులు ఉన్నారు.

## క్రీడలతో క్రమశిక్షణ పెంపొందుతుంది




- **ప్రధానోపాధ్యాయులు శాంతన్న**

**పెద్దమందడి,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):** క్రీడలు విద్యార్థుల జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, క్రీడలతో క్రమశిక్షణ పెంపొందుతుందని పెద్దమందడి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న అన్నారు. మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు సమయపాలన, పట్టుదల, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి వంటి మంచి లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. క్రీడలు విద్యార్థులలో ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించడంతో పాటు ఓటమిని స్వీకరించి తిరిగి విజయం సాధించేలా ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు.మండల స్థాయి క్రీడా పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన శాంతన్న, ప్రతిభను చాటుతూ ఉన్నత స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడిలో అట్టహాసంగా మండల స్థాయి క్రీడా పోటీలు

- **క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలి**
- **మండల విద్యాధికారి మంజులత**





**పెద్దమందడి,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలో మండల స్థాయి క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాధికారి మంజులత క్రీడా పోటీలను ప్రారంభించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి మంజులత మాట్లాడుతూ.. క్రీడల్లో చురుకుగా పాల్గొని రాణించే విద్యార్థులు చదువుల్లోనూ ముందుంటారని అన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు.
చదువుతో పాటు క్రీడలకు కూడా సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు.క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని, ఓటమి ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా దానిని ఒక పాఠంగా తీసుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని మంజులత సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఏకాగ్రత పెరుగుతాయని పేర్కొన్నారు.మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని విద్యార్థులకు ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరిణత,గ్రామ సర్పంచ్ సూర్యగంగా,వార్డు సభ్యులు సింగిరెడ్డి అమలా కురుమూర్తి, ప్రధానోపాధ్యాయులు శాంతన్న,ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనాలకు నీళ్లివ్వడానికి ఇంత జాప్యమా?

- **గణేష్ నిమజ్జనానికి నీటి కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి దురదృష్టకరం**
- **ప్రభుత్వం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలి**
- **చింతకుంట కెనాల్‌కు నీరు విడుదల చేయడంలో నిర్లక్ష్యం తగదు: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాదగిరి సునీల్‌రావు**




**కరీంనగర్, సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** గణేష్ నిమజ్జనానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సింది పోయి, నిమజ్జనాలకు ఇబ్బందులు కలిగించే పరిస్థితులు సృష్టించడం దురదృష్టకరమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.
కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గణేష్ నిమజ్జనాల కోసం చింతకుంట కెనాల్‌కు ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయాలని మేయర్, డిప్యూటీ మేయర్ హోదాలో అధికారులకు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని సునీల్‌రావు ఆరోపించారు. గత ప్రభుత్వాల హయాంలో ఎస్సారెస్పీలో నీరు అందుబాటులో ఉన్నప్పుడు గణేష్ నిమజ్జనాల కోసం ప్రత్యేకంగా చింతకుంట కెనాల్‌కు నీటిని విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు.
కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సైతం జిల్లా అధికారులతో పాటు ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటి విడుదలపై విజ్ఞప్తి చేశారని చెప్పారు. భారీ సంఖ్యలో గణేష్ విగ్రహాలు చింతకుంట కెనాల్‌లో నిమజ్జనం కానున్నప్పటికీ ప్రభుత్వం తొలుత స్పందించలేదని విమర్శించారు.
నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్, బారికేడింగ్, క్రేన్లు తదితర ఏర్పాట్లు చేసిన తర్వాత నీరు లేకుంటే నిమజ్జనాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మండపాల నిర్వాహకుల విజ్ఞప్తి మేరకే బీజేపీ చింతకుంట కెనాల్ వద్ద ఆందోళన చేపట్టిందని స్పష్టం చేశారు. బండి సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ధర్నా నిర్వహించామని తెలిపారు.
ఆందోళన అనంతరం ప్రభుత్వం చింతకుంట కెనాల్‌కు నీటిని విడుదల చేసిందని సునీల్‌రావు పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనాల కోసం నీటిని విడుదల చేయాలని కోరుతూ ఆందోళన చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఎస్సారెస్పీలో పెద్ద మొత్తంలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ నిమజ్జనాల కోసం అవసరమైన నీటిని విడుదల చేయడంలో ఎందుకు జాప్యం జరిగిందో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.
ప్రజలు తమ చందాలతో పండగలు నిర్వహించుకుంటున్నారని, ప్రభుత్వం ప్రజలు నిర్వహించే అన్ని పండగలకు సమానంగా సహకరించాలని సూచించారు. ఏ మతం, ఏ వర్గానికి చెందిన పండగైనా గౌరవించి, అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రభుత్వం ద్వంద్వ వైఖరిని విడనాడి ప్రజల పండగలకు సహకరించాలని హితవు పలికారు.
ఈ సమావేశంలో బీజేపీ కార్పొరేటర్లు పొన్నం లక్ష్మిమొండయ్య, రామన్, తోట అనిల్, ఒంటెల సత్యనారాయణరెడ్డి, దేశ శిల్పవేదం, సోమిడి వేణు, మాసం గణేష్, కోఆప్షన్ సభ్యులు బల్వీర్‌సింగ్, మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి, నాయకులు పండుగ నాగరాజు, భాస్కర్, కటకం లోకేష్, అక్షయ్, రాజ ప్రభాకర్, కుంభం అనిల్, అరకిల శంకర్, సురేందర్, భాస్కర్, రాజశేఖర్ సత్యనారాయణరెడ్డి, యువమోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

***మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్ష***

- **పలు గణపతి మండపాల్లో ప్రత్యేక పూజలు**
- **అన్నదాన కార్యక్రమాలు ప్రారంభం**
- **ప్రశాంత వాతావరణంలో నిమజ్జనాలు నిర్వహించుకోవాలని సూచన**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** విఘ్నాలను తొలగించే ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల పరిధిలోని పలు వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి.. అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

పలు మండపాల్లో పూజలు

కూసుమంచి మండలంలోని నాయకన్ గూడెం, గురవాయిగూడెం, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్ వద్ద మారుతినగర్, ఖమ్మం నగరంలోని బేడ జంగాల కాలనీ, శ్రీనగర్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను మంత్రి సందర్శించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

ప్రశాంతంగా నిమజ్జనం చేసుకోవాలి

గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లుగానే నిమజ్జన కార్యక్రమాలను కూడా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. భక్తులందరూ సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమాల్లో...: ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోక బత్తిని అనిత, వైస్‌చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్ పార్టీ కూసుమంచి మండల అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిషోర్, పలువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



# హుజురాబాద్ ఆర్టీఐ కన్వీనర్‌గా పిట్ట శ్రీనివాస్

- **ఆర్టీఐ చట్టం కోసం కృషి చేస్తా**



**హుజురాబాద్,సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** సమాచార హక్కు చట్టం సాధన(ఎస్ హెచ్ సి ఎస్ సి )కమిటీ కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండల కన్వీనర్‌గా పిట్ట శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ నాయకులు, సభ్యుల సమక్షంలో శ్రీనివాస్‌ను మండల కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకొని బాధ్యతలు అప్పగించారు.
ఈ సందర్భంగా పిట్ట శ్రీనివాస్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పాలనపై అవసరమైన సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉందని, అయితే చాలామందికి చట్టంపై పూర్తి అవగాహన లేకపోవడంతో ఆర్టీఐ వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. హుజురాబాద్ మండల పరిధిలోని ప్రజలకు ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు.
ప్రభుత్వ శాఖల్లో ప్రజలకు సంబంధించిన సమాచారం పారదర్శకంగా అందుబాటులో ఉండేలా చట్టబద్ధమైన మార్గాల్లో కృషి చేస్తామని, ఆర్టీఐ చట్టాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా, నిబంధనలకు అనుగుణంగా వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తామని శ్రీనివాస్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచేందుకు కార్యక్రమాలను విస్తరించనున్నట్లు తెలిపారు.
తనపై నమ్మకం ఉంచి హుజురాబాద్ మండల కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, నియోజకవర్గ అధ్యక్షులు తిరగమల్ల నాగార్జున, జిల్లా కన్వీనర్ బండ నరేందర్‌కు పిట్ట శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
కమిటీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన చెప్పారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని చట్టపరమైన విధానాల్లో పొందేలా అవగాహన కల్పించడంతో పాటు, సమాచార హక్కు చట్టం లక్ష్యాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తానని తెలిపారు.
హుజురాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, యువత, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలకు ఆర్టీఐ చట్టంపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడతామని శ్రీనివాస్ పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ కమిటీ అభివృద్ధికి, ప్రజల అవగాహన పెంపునకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గణేష్ నిమజ్జనం, శోభాయాత్రకు సర్వం సిద్ధం



- **రూ.1.50 కోట్లతో గతం కంటే ఘనంగా ఏర్పాట్లు**
- **భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు: మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** నగరంలో గణేష్ నిమజ్జనం, శోభాయాత్ర ఉత్సవాలను ప్రశాంతంగా, వైభవంగా నిర్వహించేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. గతంతో పోలిస్తే ఈసారి మరింత ఘనంగా రూ.1.50 కోట్లతో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. టవర్ సర్కిల్, రాంనగర్, కమాన్ ప్రాంతాల్లో ప్రత్యేక అలంకరణలు, గణేష్ నిమజ్జన పాయింట్ల వద్ద పూల అలంకరణలు, ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలతో ఏర్పాట్లు చేశారు. కొత్తపల్లి, మానకొండూర్ చెరువులు, చింతకుంట కెనాల్ వద్ద నిమజ్జనానికి అవసరమైన సౌకర్యాలను సిద్ధం చేశారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండి భక్తులకు అవసరమైన సహకారం అందించాలని మేయర్ సూచించారు.

మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, నగరపాలక సంస్థ అధికారులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ప్రధాన గణేష్ నిమజ్జన పాయింట్లను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జన ఉత్సవాలను విజయవంతం చేయాలని, ప్రశాంతమైన వాతావరణంలో శోభాయాత్రను నిర్వహించి కరీంనగర్ నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని మేయర్ పిలుపునిచ్చారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

**వేలేరు, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం పీచర గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు వేలేరు ఎస్సై సురేష్ తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, పీచర గ్రామ శివారులో కొండాపూర్ గ్రామానికి చెందిన పుట్ట రాజు తనకు చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను లోడ్ చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు గుర్తించారు. వెంటనే ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్ హెచ్చరించారు.

# గ్రాడ్యుయేట్లంతా ఓటు నమోదు చేసుకోవాలి

- **సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్**



**వనపర్తి,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్‌రంగారెడ్డిహైదరాబాద్, వరంగల్‌ఖమ్మంనల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు 2027 మార్చిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కొత్త ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. నవంబర్ 1, 2026 నాటికి డిగ్రీ పూర్తి చేసి మూడు సంవత్సరాలు పూర్తయిన పట్టభద్రులు ఓటు నమోదుకు అర్హులని పేర్కొన్నారు. గతంలో ఓటు ఉన్నవారు సైతం కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఫారం18 ద్వారా నవంబర్ 6, 2026లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ తదితర అవసరమైన పత్రాలతో ఆన్‌లైన్‌లో లేదా సంబంధిత ఆర్‌డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టభద్రులందరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకుని, ఈ సమాచారాన్ని ఇతరులకు చేరవేయాలని శంకర్ గౌడ్ కోరారు.

# బోర్నపల్లిలో ఘనంగా ఆయుష్ అవగాహన కార్యక్రమం

- **ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఆయుర్వేద వైద్యంపై అవగాహన**
- **సహజ వైద్య విధానాలతో ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు సూచనలు**




**బోర్నపల్లి , సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో బోర్నపల్లి గ్రామంలో ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామంలోని మహిళలు, వృద్ధులు, చిన్నారులు, యువతతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఆయుర్వేద వైద్య విధానం, సహజసిద్ధమైన చికిత్సా పద్ధతులు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రజలకు వివరించారు. ఆధునిక జీవనశైలిలో ఎదురవుతున్న అనేక ఆరోగ్య సమస్యలను నివారించేందుకు ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా, తగినంత నిద్ర వంటి అంశాలు ఎంతో ముఖ్యమని సూచించారు.

ఆయుర్వేదంతో ఆరోగ్య పరిరక్షణ

ఆయుర్వేద వైద్యం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలకు సంప్రదాయ పద్ధతుల్లో చికిత్స, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తగిన సమయంలో వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న ఆయుష్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్యకరమైన జీవన విధానంపై సూచనలు

ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో సహజసిద్ధమైన పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వడం, సమయానికి భోజనం చేయడం, తగినంత నీరు తాగడం, శారీరక శ్రమ చేయడం, యోగా మరియు ధ్యానం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను జీవితంలో భాగంగా చేసుకోవాలని వైద్య సిబ్బంది వివరించారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే ముందస్తు జాగ్రత్తలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమని అవగాహన కల్పించారు.

ప్రజల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమం

కార్యక్రమంలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొని ఆయుర్వేద వైద్య విధానం, ఆయుష్ సేవలకు సంబంధించిన పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్య సేవలపై ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రజలకు అందుబాటులో ఉన్న ఆయుష్ సేవలను మరింతగా వినియోగించుకునేలా చేయడం, ఆయుర్వేద వైద్యం మరియు ఆరోగ్యకరమైన జీవన విధానంపై గ్రామీణ ప్రజల్లో అవగాహన పెంచడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

# బోర్నపల్లి శివాలయంలో ఘనంగా వినాయక పూజ, కుంకుమ పూజ

- **భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. భారీగా పాల్గొన్న మహిళలు, భక్తులు**
- **భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు**





**బోర్నపల్లి, సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** బోర్నపల్లి గ్రామంలోని శివాలయంలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని వినాయక పూజ, కుంకుమ పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భాస్కర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమానికి గ్రామంలోని మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో శివాలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

ప్రత్యేక అలంకరణలో గణనాథుడు

వినాయక విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలు, పూలమాలలు, అలంకరణ సామగ్రితో ఆకర్షణీయంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు వినాయకుడికి సంప్రదాయ బద్ధంగా పూజలు చేశారు.

కుంకుమ పూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తూ కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కోసం ప్రత్యేకంగా ప్రార్థించారు. కుంకుమ పూజతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

భాస్కర్ శర్మ మాట్లాడుతూ..విఘ్నేశ్వరుడిని భక్తితో ఆరాధించడం ద్వారా కుటుంబాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.మన హిందూ సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. పండుగలను కేవలం వేడుకలుగా కాకుండా భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీకగా నిర్వహించాలని సూచించారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంతో ఉండి ఆలయ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

ప్రజలకు సుఖశాంతులు కలగాలని ప్రార్థన

గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, ఎలాంటి విఘ్నాలు లేకుండా అభివృద్ధి కొనసాగాలని గణనాథుడిని ప్రార్థించినట్లు భాస్కర్ శర్మ తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

వినాయక పూజ, కుంకుమ పూజ సందర్భంగా శివాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. మహిళలు ప్రత్యేకంగా పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# గణపయ్యకు నైవేద్యం.. భక్తులకు అన్నప్రసాదం

- **సత్తుపల్లి మహాగణపతి సన్నిధిలో మంత్రి పొంగులేటి సేవాభక్తి.**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సత్తుపల్లిలో భక్తిభావం వెల్లివిరిసింది. పట్టణంలోని శ్రీ మహాగణపతి ఆలయాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. గణపతి మాలధారణ చేసిన భక్తులకు మంత్రి స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. భక్తులతో కలిసి కొద్దిసేపు గడిపిన ఆయన ఉత్సవాల విశేషాలను అడిగి తెలుసుకున్నారు. మహాగణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



# నగరపాలక సంస్థలో ఘనంగా గణేష్ నవరాత్రి వేడుకలు

- **మట్టి వినాయకుడికి ప్రత్యేక పూజలు**
- **ఉద్యోగులు, సిబ్బందితో కలిసి అన్నదానంలో పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్**



**కరీంనగర్, సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9వ రోజు మంగళవారం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మట్టి వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణనాథుడికి అభిషేకం, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.విఘ్నేశ్వరుని ఆశీస్సులతో కరీంనగర్ నగరం సుభిక్షంగా, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందికి స్వయంగా వడ్డన చేసి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 27న చలో యాదాద్రి

- **కరీంనగర్ జిల్లా నుంచి వెయ్యి మంది ఉద్యమకారులను సమీకరించాలి**

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఈ నెల 27న యాదాద్రిలో నిర్వహించనున్న చలో యాదాద్రి కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా నుంచి వెయ్యి మంది ఉద్యమకారులు తరలిరావాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో కార్యక్రమంపై చర్చించారు.

ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. చలో యాదాద్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు యువత, విద్యార్థులు, మహిళలు, కళాకారులు, కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి వచ్చే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బిజ్జిగిరి షరీఫ్, జమ్మికుంట, ఉప్పల్, కాజీపేట ప్రాంతాల నుంచి ఉద్యమకారులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరవీరులు, గాయపడిన వారు, కేసులు ఎదుర్కొన్న వారు, జైలు జీవితం గడిపినవారు, యువత, విద్యార్థులు, మహిళలు, చిన్న వ్యాపారులు, కార్మికులు, రైతులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన ఈ నెల 27న యాదాద్రిలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమావేశంలో ఫోరం రాష్ట్ర కన్వీనర్ గుండేటి ఐలయ్య, నియోజకవర్గ కన్వీనర్ ఆరె రమేష్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.కుమారస్వామి, సర్పంచ్‌లు కొండ అర్జున్, జక్కె కిరణ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడెపు సారంగపాణి, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది కుమార్, జమ్మికుంట టౌన్ అధ్యక్షుడు మద్దూరి శంకరయ్య, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు రావుల రాజబాబు, జమ్మికుంట వర్కింగ్ ప్రెసిడెంట్ పాకాల మల్లారెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మంకాలి రమ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రాధాన్యం.!



- **విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి.**

**సత్తుపల్లి, సెప్టెంబరు 22 (తెలంగాణ ముచ్చట్లు):** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు వారికి ప్రభుత్వ పథకాల ఫలాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హైపవర్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయా వర్గాలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, హక్కుల పరిరక్షణ, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు సక్రమంగా చేరేలా పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరాన్ని చర్చించారు. అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడంతో పాటు వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం చూపేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో శ్రీ కృష్ణ యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని ఆకర్షణీయమైన ముగ్గులు వేసి తమ ప్రతిభను చాటుకున్నారు.ముఖ్య అతిథులుగా ముల్కనూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ఉపసర్పంచ్ కాసగోని మమత బాలకృష్ణ, 8వ వార్డు సభ్యుడు సీహెచ్. అనిల్, 9వ వార్డు సభ్యుడు ముడికే భిక్షపతి, భీమదేవరపల్లి మండల యూత్ అధ్యక్షుడు జక్కుల అనిల్ హాజరయ్యారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి అప్పని శిరీష, రెండో బహుమతి గిరబోయిన వినోద, మూడో బహుమతి ఆదరి అశ్విని అందుకున్నారు.బహుమతులను ముడికే బాలరాజు, దొండ రాహుల్, బర్మా హరీష్ తదితరులు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ శ్రీ కృష్ణ యాదవ యూత్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

- **భూ వ్యవహారాలు చట్టబద్ధంగా నిర్వహించుకోవాలి.**
- **తహసీల్దార్ మద్దినేని మురళి.**



**దమ్మపేట, సెప్టెంబరు 22 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండల రెవెన్యూ కార్యాలయంలో దళారీ వ్యవస్థకు ఎలాంటి అవకాశం లేదని డిప్యూటీ కలెక్టర్ (ట్రైనీ), దమ్మపేట తహసీల్దార్ మద్దినేని మురళి స్పష్టం చేశారు. కొందరు వ్యక్తులు తిరిగి దళారులుగా వ్యవహరిస్తున్నారనే సమాచారం తమ దృష్టికి వచ్చిందని, రైతులు, భూ హక్కుదారులు వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ పదవీకాలం కొంతకాలమే ఉంటుందని, అనంతరం తమకు అనుకూలమైన వ్యక్తులే తహసీల్దార్‌గా వస్తారంటూ కొందరు దళారులు రైతులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. భూ బదిలీలు, పట్టా పుస్తకాలు, పాస్‌బుక్కులు తదితర భూ వ్యవహారాలకు సంబంధించి ఎలాంటి లావాదేవీలైనా పూర్తిగా చట్టబద్ధంగా, రెవెన్యూ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా మాత్రమే నిర్వహించుకోవాలని సూచించారు. ఎవరైనా దళారులు భూ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని 'పట్టా పుస్తకాలు ఇప్పిస్తాం.. పాస్‌బుక్కులు ఇప్పిస్తాం.. భూ సమస్యను పరిష్కరిస్తాం' అంటూ ప్రలోభాలకు గురిచేస్తే వారి మాటలు నమ్మవద్దని తెలిపారు. అలాంటి వ్యక్తుల గురించి వెంటనే దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంతో పాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దళారీ వ్యవస్థను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి వ్యక్తుల కార్యకలాపాలపై ఇప్పటికే నిఘా ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. రైతులు, భూ హక్కుదారులు అప్రమత్తంగా ఉండి దళారుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దళారీ వ్యవస్థ పట్ల అప్రమత్తంగా ఉండి.. భూ వ్యవహారాల్లో చట్టబద్ధమైన విధానాలనే అనుసరించాలని మద్దినేని మురళి సూచించారు.

# పాత డిగ్రీ కళాశాల భవనాన్ని విద్యార్థుల హాస్టల్‌గా వినియోగించాలి

- **విద్యార్థులకు వసతి కల్పించాలి లేదంటే ఆందోళనకు పిలుపునిస్తాం**
- **ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు**




**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంటలో నిరుపయోగంగా ఉన్న పాత ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని విద్యార్థుల హాస్టల్ కోసం వినియోగించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం పాత ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని సందర్శించిన ఆయన, భవనం పరిస్థితిని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనం పెద్దగా దెబ్బతినకుండా అందుబాటులో ఉన్నప్పటికీ కళాశాలను ఎందుకు మూసివేశారో ప్రభుత్వం స్పష్టం చేయాలని అన్నారు. ప్రస్తుతం సరైన హాస్టల్ వసతి లేక దూర ప్రాంతాల నుంచి కళాశాలలకు వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని వెంటనే విద్యార్థుల హాస్టల్‌గా మార్చి వసతి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమస్యను ప్రభుత్వం పట్టించుకోకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్ఎఫ్‌డీ కోకన్వీనర్ గోస్కుల అజయ్, జమ్మికుంట నగర కార్యదర్శి భోగం శశాంక్, రోహిత్, ఆఫిద్, మోయిస్, సల్మాన్, రిషికేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# నాయిని చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో నవరాత్రులు ఘనంగా పూజలందుకున్న గణనాథుల నిమజ్జనానికి నాయిని చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మంగళవారం పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో గణనాథుడిని పూజించిన భక్తులు నిమజ్జన కార్యక్రమాన్ని కూడా అదే భక్తి భావంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు, భక్తులు సమయానుకూలంగా బయలుదేరి నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేసుకోవాలని కోరారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు అధికారులకు, పోలీసులకు సహకరించాలని తెలిపారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు పొనగంటి విష్ణు, పొనగంటి రాము, పట్టణ సీఐ రామకృష్ణ, ఏఈ వికాస్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# జమ్మికుంట మార్కెట్‌లో కొత్త పత్తి కొనుగోళ్లు

**జమ్మికుంట, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో కొత్త పత్తి కొనుగోళ్లకు మంగళవారం శ్రీకారం చుట్టారు. వివిధ గ్రామాల నుంచి రైతులు తీసుకొచ్చిన కొత్త పత్తికి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ముహూర్తం చేసి కొబ్బరికాయలు కొట్టారు. కొత్త పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులను శాలువాలతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు.

మొదటి రోజు జరిగిన బహిరంగ వేలంపాటలో కొత్త పత్తికి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.7,272, కనిష్ఠంగా రూ.7,011 ధర లభించింది. మురళీకృష్ణ ట్రేడర్స్, మల్లికార్జున ట్రేడర్స్ పత్తిని కొనుగోలు చేశారు.



ఇల్లందకుంట మండలం మల్రివానిపల్లి గ్రామానికి చెందిన కలాల గణపతిరెడ్డి, పైండ్ల తిరుపతిరెడ్డి, సిరిసేడు గ్రామానికి చెందిన బీనవేని కొమురయ్య కొత్త పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతుల్లో ఉన్నారు.

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ, జమ్మికుంట మార్కెట్‌లో లైసెన్స్ పొందిన వ్యాపారులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన లైసెన్స్ పొందిన వ్యాపారులు కూడా పత్తి కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు రావచ్చని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడంతోపాటు మార్కెట్ పాలకవర్గం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని పేర్కొన్నారు.

రైతులు పండించిన పత్తిని నేరుగా మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి బహిరంగ వేలం ద్వారా మంచి ధర పొందాలని సూచించారు. గ్రామాల్లో దళారులను నమ్మి నష్టపోకుండా మార్కెట్ యార్డులోనే పత్తిని విక్రయించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం, ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్.రాజా, మార్కెట్ కమిటీ గౌరవ సభ్యులు, సిబ్బంది, అడ్తిదారులు, వ్యాపారులు, రైతులు, గుమాస్తాలు, హమాలీలు, దాడువాయి కార్మికులు, దాడువాయి సంఘం అధ్యక్షుడు ఎరబెల్లి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఏదులాపురం ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయండి

- **నాణ్యతలో రాజీ పడొద్దు**
- **రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల భవన నిర్మాణ పనుల ఆకస్మిక తనిఖీ**



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** ఏదులాపురం మున్సిపాలిటీలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద గల తరుణీ హట్ ప్రాంగణంలో కొనసాగుతున్న ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల భవన నిర్మాణ పనులను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ భవన సముదాయం అందుబాటులోకి వస్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల సేవలు ఒకే చోట లభిస్తాయని, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండలాధ్యక్షులు తోట వీరభద్రం, పలువురు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రుల సందర్భంగా ఘనంగా అన్నదానం.. భక్తులతో కిక్కిరిసిన దేవస్థానం

**ముల్కనూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** గణపతి నవరాత్రుల సందర్భంగా ముల్కనూర్ శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 550 మంది భక్తులు అన్నదాన తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముల్కనూర్ ఎస్సై రాజు హాజరై వినాయక పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాలను అందించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ జక్కుల మల్లికార్జున్, వైస్ చైర్మన్ గిరబోయిన కుమారస్వామి, మాజీ చైర్మన్ జక్కుల ప్రకాశం, యాదవ సంఘం కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాజాజీనగర్‌లో మిన్నంటిన ఆధ్యాత్మిక శోభ

- **కాలనీ వాసుల ఐకమత్యంతోనే వేడుకలు విజయవంతం**
- **కాలనీ అభివృద్ధి అధ్యక్షుడు బారాజు కృష్ణ ప్రసాద్**

**వరంగల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 52వ డివిజన్ పరిధిలోని రాజాజీనగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా కాలనీ మొత్తం భక్తిభావంతో, ఆధ్యాత్మిక శోభతో అలరారుతోందని కాలనీ అభివృద్ధి అధ్యక్షుడు బారాజు కృష్ణ ప్రసాద్ తెలిపారు.రాజాజీనగర్ వరసిద్ధి వినాయక గజానన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం కాలనీ వాసులతో కలిసి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమ రెడ్డి, 52వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చాడ స్వాతి రెడ్డి వినాయక మండపాన్ని వేర్వేరుగా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.మహిళలతో భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు, దంపతులతో విశేష హోమ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం వేళల్లో మహిళలతో కోలాటాలు, వివిధ సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.పిల్లల్లో మేధోశక్తి, సృజనాత్మకత పెంపొందించేలా ప్రత్యేక ఆటలు, విజ్ఞానదాయక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాతల సహకారంతో ప్రతిరోజూ భక్తులకు భారీ ఎత్తున మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సాయంత్రం పూజలకు హాజరయ్యే భక్తులందరికీ ప్రత్యేక అల్పాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.కాలనీ వాసులందరి ఐకమత్యం, సహకారం, సమష్టి కృషి వల్లే గణపతి నవరాత్రి ఉత్సవాలు ఇంత ఘనంగా, విజయవంతంగా కొనసాగుతున్నాయని గజానన మండలి ప్రతినిధులు తెలిపారు.ఉత్సవాల నిర్వహణలో మండలి సభ్యులు చాడ జనార్దన్ రెడ్డి, గోలి సురేందర్ రెడ్డి, అచ్చ జగదీశ్వర్, వడ్లకొండ రవీందర్, సాదుల బాలరాజు, రేగూరి కృష్ణారెడ్డి, నారాయణ రెడ్డి, రాజేందర్ రెడ్డి, రాజేశ్వర్ రావు, సంజీవరావు, శ్రీనివాసరావు, శంకర్ రెడ్డి, రాయకంటి శ్రీనివాస్, జగ్గు నాయక్, రాజారామ్ తదితరులు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని కాలనీ అభివృద్ధి అధ్యక్షుడు బారాజు కృష్ణ ప్రసాద్ తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# కొత్తపెల్లిలో 19 ఏళ్ల యువతి అదృశ్యం.. కేసు నమోదు



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపెల్లి గ్రామానికి చెందిన బొమ్మిశెట్టి సౌజన్య (19) అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
పోలీసుల వివరాల ప్రకారం బొమ్మిశెట్టి స్వప్న, కుమార్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సెప్టెంబర్ 21, 2026 రాత్రి సుమారు 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేసి ఇంట్లో నిద్రించారు. రాత్రి ఒంటిగంట సమయంలో స్వప్న లేచి చూడగా తన పెద్ద కుమార్తె సౌజన్య ఇంట్లో కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అనంతరం బంధువులకు ఫోన్ చేసి ఆరా తీసినా సౌజన్య ఆచూకీ లభించలేదు. దీంతో సౌజన్య తల్లి బొమ్మిశెట్టి స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి, యువతి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.

## ప్రజలే మన బలం.. గెలిచి మన సత్తా చూపిస్తాం



- **దానం నాగేందర్‌ను కలిసిన దయ్యాల దాసు**

**వనపర్తి,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రి దానం నాగేందర్‌ను సీనియర్ నాయకులు దయ్యాల దాసు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన రాజకీయ కార్యక్రమాలు, ప్రజల్లోకి వెళ్లే విధానం తదితర అంశాలపై వారు సమాలోచనలు జరిపారు.ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. దేనికైనా రెడీ.. ఎన్నికలు మనకేం కొత్త కాదు. ఫైట్ చేయడం మనకేం కొత్త కాదు. మనం ప్రజల గుండెల్లో ఉన్నాం. ప్రజలు మన వెంట ఉన్నారు. ఖచ్చితంగా గెలిచి మన సత్తా ఏంటో చూపిస్తాం అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని, ప్రజల కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు దయ్యాల దాసు, నాగేష్‌సాగర్, గద్దల ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జూరాల ఆయకట్టు రైతులు అధైర్యపడొద్దు

- **మంత్రులు, ఎమ్మెల్యేల బృందం**



**వనపర్తి,సెప్టెంబర్22(తెలంగాణ ముచ్చట్లు):** జూరాల ప్రాజెక్టు ఆయకట్టు కింద సాగు చేస్తున్న రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఒక్క ఎకరం పంట కూడా ఎండిపోకుండా ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ప్రస్తుత పంటలకు సాగునీరు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు.జూరాల ఆయకట్టు రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అన్ని మార్గాల్లో చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణలోని జూరాల, భీమా, నెట్టెంపాడు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పరిధిలో సాగు చేస్తున్న పంటలను కాపాడేందుకు రోజుకు 5,000 క్యూసెక్కుల చొప్పున 15 రోజుల పాటు కృష్ణా జలాలను నియంత్రితంగా విడుదల చేయాలని లేఖలో కోరినట్లు తెలిపారు.ఈ నాలుగు సాగునీటి పథకాల పరిధిలో సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టు కృష్ణా జలాలపై ఆధారపడి ఉందని, ప్రస్తుతం పంటలకు కీలక దశ కావడంతో సకాలంలో సాగునీరు అందించడం అత్యంత అవసరమని మంత్రి తన లేఖలో పేర్కొన్నట్లు మేఘారెడ్డి తెలిపారు.
కర్ణాటకకు మంత్రులు, ఎమ్మెల్యేల బృందం సాగునీటి విడుదలపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసి తెలంగాణ రైతుల సాగునీటి అవసరాలను వివరించేందుకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కర్ణాటకకు బయలుదేరనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బృందం హైదరాబాద్ నుంచి మంగళవారం సాయంత్రం బయలుదేరి కర్ణాటక ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు వెల్లడించారు. కర్ణాటక ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో జూరాల సహా తెలంగాణలోని ఆయకట్టు ప్రాంతాల సాగునీటి అవసరాలను వివరించి, రైతుల పంటలను కాపాడేందుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని కోరనున్నట్లు మేఘారెడ్డి తెలిపారు.రైతులు ఎలాంటి అధైర్యానికి గురికావద్దు. పంటలు చేతికొచ్చే వరకు ప్రభుత్వం అందుబాటులో ఉన్న అన్ని మార్గాల్లో సాగునీటిని సమకూర్చేందుకు కృషి చేస్తోంది. జూరాల ఆయకట్టు కింద ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు.

# ఇద్దరి మధ్య తగాదాను బహిష్కరణగా చిత్రీకరణ..?

- **నిజానిజాలు తేల్చేందుకు గ్రామంలోకి అధికారులు**



**చిల్పూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** చిల్పూర్ మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సాధారణ వ్యక్తిగత తగాదా సామాజిక బహిష్కరణ అంశంగా మారడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇద్దరి మధ్య జరిగిన వ్యక్తిగత గొడవను సామాజిక బహిష్కరణగా పేర్కొంటూ ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.ఫిర్యాదును జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకోవడంతో చిల్పూర్ పోలీసులు, తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ అధికారులు మంగళవారం శ్రీపతిపల్లి గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాలతో పాటు గ్రామ పెద్దలు, సర్పంచ్‌ను విడివిడిగా విచారించారు. గొడవకు అసలు కారణం ఏమిటి, సామాజిక బహిష్కరణకు సంబంధించిన అంశం వాస్తవమేనా? అనే విషయాలపై అధికారులు సమగ్రంగా వివరాలు సేకరించారు. గ్రామంలో పరిస్థితులను పరిశీలించి సంబంధిత వ్యక్తుల నుంచి వివరాలను నమోదు చేసుకున్నారు.విచారణలో సేకరించిన వివరాలు, వెల్లడైన వాస్తవాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ప్రజల కోసం పనిచేసే వారిని పార్టీ ప్రోత్సహిస్తుంది

- **గ్రామస్థాయి నుంచే పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**
- **మండల, గ్రామ అనుబంధ కమిటీల పరిచయ వేదికలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** గ్రామస్థాయి నాయకత్వ నిర్మాణం పటిష్టంగా ఉన్నప్పుడే ఏ రాజకీయ పార్టీ అయినా బలంగా ఉంటుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ప్రజల కోసం కష్టపడి పనిచేసే వారికి పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు.
స్టేషన్ ఘనపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల, గ్రామ అనుబంధ కమిటీల పరిచయ వేదిక, మండల విస్తృతస్థాయి సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీ కార్యవర్గ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులకు కండువాలు కప్పి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ పార్టీ కల్పించిన అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభిప్రాయ భేదాలను పక్కనపెట్టి నాయకులందరినీ కలుపుకొని గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీలో కొనసాగుతూ సొంత పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించడాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పార్టీ నిబంధనలు, క్రమశిక్షణకు కట్టుబడి పనిచేయాలని సూచించారు.
పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ సమిష్టిగా పనిచేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా, రాష్ట్రంలో రెండోసారి రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.
ప్రతిపక్షాలు కాంగ్రెస్ పార్టీపై ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నాయని కడియం శ్రీహరి ఆరోపించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. బీఆర్ఎస్ అధికారాన్ని, ధరణి వ్యవస్థను అడ్డం పెట్టుకొని వందల ఎకరాల భూములను కబ్జా చేసిందని ఆయన ఆరోపించారు. అక్రమంగా సంపాదించిన వేల కోట్ల రూపాయల ఆస్తులను ఉద్యమకారులకు పంచిపెట్టాలని డిమాండ్ చేశారు.అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 24 మంది లబ్ధిదారులకు రూ.14 లక్షల 28 వేల 500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి బెలిదే వెంకన్న, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లాస్థాయి నాయకులు, మండలస్థాయి నాయకులు ఇంద్రసేనారెడ్డి, మందపురం అనిల్, నూతన గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వలసలు

- **రఘునాథపల్లి మండలం మేకలగట్టు, గోవర్ధనగిరి సర్పంచుల చేరిక**




**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయని, ఆ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మంగళవారం స్టేషన్ ఘనపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ రెడ్డి, రఘునాథపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.
రఘునాథపల్లి మండలం మేకలగట్టు గ్రామ సర్పంచ్ ఇల్లందుల రవి తన వార్డు సభ్యులతో పాటు 50 మంది నాయకులు, కార్యకర్తలతో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే గోవర్ధనగిరి గ్రామ సర్పంచ్ తోటకూర సదానందంతో పాటు వార్డు సభ్యులు ఉల్లి ఉపేంద్ర కుమార స్వామి, గొడుగు లావణ్య రాజు, వల్లెపు రాజు రజిత, నాయకులు మునిగాల మల్లేశం, వల్లెపు కుమార్, యువజన నాయకుడు జినుకుల సతీష్‌తో పాటు మరో 30 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. అందరూ కలిసి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.
రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పట్టణ అధికార ప్రతినిధిగా పోశాల కృష్ణమూర్తి



**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా పోశాల కృష్ణమూర్తి నియమితులయ్యారు. పార్టీ కోసం నిత్యం కృషి చేస్తున్న ఆయన సేవలను గుర్తించి పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యతలు అప్పగించినట్లు నాయకులు తెలిపారు.పట్టణంలో పార్టీ కార్యక్రమాలను, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్షాల విమర్శలకు సమర్థవంతంగా సమాధానం ఇవ్వడంలో కృష్ణమూర్తి కీలక పాత్ర పోషిస్తారని నాయకులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పోశాల కృష్ణమూర్తి మాట్లాడుతూ తనకు పట్టణ అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మునిసిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజుతో పాటు ఇతర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.
తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కృష్ణమూర్తి తెలిపారు.
అనంతరం పోశాల కృష్ణమూర్తిని పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# నిబంధనలు బేఖాతరు..

- **ఎక్సెన్సియా కళాశాల సీజ్**
- **అనుమతులపై వివాదం**
- **రూ.8 లక్షల జరిమానా**







**దమ్మాయిగూడ, సెప్టెంబర్ 22 ( తెలంగాణ ముచ్చట్లు):** అనుమతులు లేకుండా కళాశాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో దమ్మాయిగూడలోని ఎక్సెన్సియా జూనియర్ కళాశాలను మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కళాశాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్స్ యూనిట్ (టీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం ప్రవీణ్ కుమార్ చేసిన ఫిర్యాదు నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.కళాశాల ఇంటర్ బోర్డు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, ఫోర్జరీ ఎన్‌ఓసీ పత్రాలతో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని ఆరోపిస్తూ గడ్డం ప్రవీణ్ కుమార్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు విచారణ చేపట్టారు.విచారణలో కళాశాల యాజమాన్యం సమర్పించిన ఎన్‌ఓసీ పత్రాలపై అభ్యంతరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు టీఎస్‌యూ ప్రతినిధులు తెలిపారు. దీంతో షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు రూ.8 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అలాగే అడ్మిషన్లు నిలిపివేయాలని, కళాశాల నిర్వహణ కొనసాగించవద్దని అధికారులు ఆదేశించినప్పటికీ యాజమాన్యం నిబంధనలు పాటించలేదని టీఎస్‌యూ నాయకులు ఆరోపించారు.ఈ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బందులు కలగకుండా కళాశాలను సీజ్ చేసి, అక్కడ చదువుతున్న విద్యార్థులను గుర్తింపు పొందిన ఇతర కళాశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని గడ్డం ప్రవీణ్ కుమార్ మరోసారి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన అధికారులు మంగళవారం కళాశాలను తనిఖీ చేసి, కార్యకలాపాలను నిలిపివేసి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఈ. ప్రశాంత్, జె. రాజు, ఎస్. శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# బిహార్ లైంగిక ఘటనలో నిందితుడిపై కాల్పులు



- జముయ్‌లో నందన్ యాదవ్‌కు గాయాలు
- ఐదుగురు నిందితుల అరెస్టు
- మరో ఇద్దరు మైనర్లుగా గుర్తింపు
- కఠిన చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వం

**జముయ్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన బిహార్‌లో బాలికపై లైంగిక దాడి ఘటనకు సంబంధించి కీలక నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. జముయ్ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న నందన్ యాదవ్ గాయపడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు యత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు అధికారులు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం నందన్ యాదవ్ అదుపులోకి వచ్చిన తర్వాత తప్పించుకునేందుకు ప్రయత్నించడమే కాకుండా పోలీసులపై కాల్పులు జరిపినట్లు సమాచారం. దీంతో పోలీసులు ఎదురుకాల్పులకు దిగినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడిన నందన్‌ను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఘటనలో ప్రమేయం ఉన్న మరో ఇద్దరు మైనర్లుగా గుర్తించబడినట్లు అధికారులు వెల్లడించారు. సంఘటనలో పాల్గొన్న వారందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతోందని బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ చౌదరి తెలిపారు. నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఘటన రాష్ట్రాన్ని కలచివేసిందని, బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు చేపడుతున్నామని అధికారులు పేర్కొన్నారు. మహిళల భద్రతకు భంగం కలిగించే ఘటనలను ఏమాత్రం సహించబోమని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సెప్టెంబర్ 19న వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. కోచింగ్ కేంద్రం నుంచి ఇంటికి వెళుతున్న పదో తరగతి విద్యార్థిని, ఆమెతో ఉన్న బాలుడిని కొందరు యువకులు అడ్డుకున్నట్లు వీడియోలో కనిపించింది. బాలుడిపై దాడి చేసిన అనంతరం బాలికను అతడి నుంచి వేరు చేసేందుకు ప్రయత్నించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. వీడియోలో నందన్ యాదవ్‌గా గుర్తించబడిన వ్యక్తి బాలికను మెడ పట్టుకుని కొంత దూరం తీసుకెళ్లినట్లు కనిపించింది. బాలిక తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమెను వేధించిన దృశ్యాలు నమోదయ్యాయి. అనంతరం బాలుడు అక్కడికి చేరుకోవడంతో ఆమెను విడిచిపెట్టినట్లు వీడియోలో కనిపించింది. బాలికను రక్షించేందుకు బాలుడు అడ్డుగా నిలిచిన దృశ్యాలు ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమయ్యాయి. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుండగా, బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతామని పోలీసులు వెల్లడించారు.

# స్వదేశానికి తిరిగివస్తానన్న షేక్ హసీనా

- 2026 డిసెంబర్ నాటికి పునరాగమనం లక్ష్యం
- రాజకీయ పోరాటం కొనసాగిస్తానని స్పష్టీకరణ
- అవామీ లీగ్ పునర్నిర్మాణంపై దృష్టి



**ఢాకా, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా 2026 డిసెంబర్ నాటికి తాను తప్పకుండా స్వదేశానికి తిరిగి వెళ్తానని ప్రకటించారు. తాను ఎప్పుడు తిరిగి వెళ్తాననే అంశం కంటే ఏ విధంగా వెళ్తానన్నదే ముఖ్యమని పేర్కొన్నారు. ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తన పునరాగమనం శాంతియుతంగా, చట్టబద్ధమైన మార్గంలోనే జరగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. 2025 నవంబర్‌లో బంగ్లాదేశ్ ట్రిబ్యునల్ తనకు విధించిన మరణశిక్షను షేక్ హసీనా తీవ్రంగా ఖండించారు. ఆ తీర్పు రాజకీయ ప్రేరేపితమైందని, న్యాయసమ్మతమైనది కాదని ఆరోపించారు. తనపై కొనసాగుతున్న న్యాయ ప్రక్రియను ఆమె తీవ్రంగా విమర్శిస్తూ, అది రాజకీయ లక్ష్యాలతో నడిపిస్తున్న చర్యగా అభివర్ణించారు. తన నిష్క్రమణ అనంతరం ఏర్పడిన ప్రస్తుత ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా పేర్కొన్న హసీనా, తనపై జరుగుతున్న విచారణను ప్రహసనంగా అభివర్ణించారు. రాజకీయ పోరాటంలో భాగంగా అవసరమైతే జైలుకు వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువల కోసం తాను వెనకడుగు వేయబోనని తెలిపారు. ప్రస్తుతం రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఎదుర్కొంటున్న అవామీ లీగ్ పార్టీని పునర్నిర్మించడంపై దృష్టి సారిస్తానని చెప్పారు. పార్టీ శ్రేణులతో తిరిగి సంబంధాలను బలోపేతం చేసి రాజకీయంగా పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని భావిస్తున్నట్లు వివరించారు. ప్రజలతో మమేకమై పార్టీని మళ్లీ బలోపేతం చేయడం తన ప్రాధాన్య లక్ష్యమని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణ కోసం కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని హసీనా వెల్లడించారు. ప్రస్తుతం దేశంలో ఉగ్రవాద, తీవ్రవాద శక్తుల ప్రభావం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కేవలం బంగ్లాదేశ్ సమస్య మాత్రమే కాకుండా ప్రాంతీయ భద్రతకు కూడా సవాలుగా మారే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. అయితే తన పునరాగమన ప్రణాళికలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా ఖరారు కాలేదని షేక్ హసీనా స్పష్టం చేశారు. ఈ అంశంపై బంగ్లాదేశ్ లేదా భారత ప్రభుత్వాలతో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక, అనధికారిక చర్చలు జరపలేదని తెలిపారు. పరిస్థితులను పరిశీలిస్తూ తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తానని వెల్లడించారు.

# సంకేత భాషతో సమానత్వానికి వేదిక

- హక్కుల సాధనలో కీలక పాత్ర
- వినికిడి లోపం ఉన్నవారికి సంభాషణ వారధి
- విద్య, ఉపాధిలో అవకాశాల విస్తరణ
- సమగ్ర సమాజ నిర్మాణానికి సంకేత భాష అవసరం



**డెస్క్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** ప్రపంచవ్యాప్తంగా వినికిడి లోపం ఉన్న కోట్లాది మంది ప్రజలకు సంభాషణే జీవితంలో అత్యంత కీలకమైన అంశం. ఇతరులతో భావాలను పంచుకోవడం, తమ ఆలోచనలను వ్యక్తపరచడం, విద్యను అభ్యసించడం, ఉద్యోగ అవకాశాలను పొందడం వంటి ప్రతి అంశంలో సంభాషణ ప్రధాన పాత్ర పోషిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో సంకేత భాష వినికిడి లోపం ఉన్న వ్యక్తులకు ఒక అమూల్యమైన వరంగా నిలుస్తోంది. ఈ భాష ద్వారా వారు తమ భావాలను స్పష్టంగా వ్యక్తీకరించగలుగుతున్నారు. సంకేత భాషల ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేయడానికి, వాటి అభివృద్ధికి ప్రోత్సాహం కల్పించడానికి ప్రతి ఏడాది సెప్టెంబర్ 23న అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సంకేత భాష అనేది కేవలం చేతి వేళ్ల కదలికలతో చేసే సంభాషణ మాత్రమే కాదు. దీనికి ప్రత్యేకమైన వ్యాకరణం, నిర్మాణం, అర్థవ్యవస్థ ఉంటాయి. ప్రతి దేశానికి, ప్రాంతానికి తనదైన సంకేత భాష ఉంటుంది. మాటల భాషలు ఎంత వైవిధ్యంగా ఉంటాయో సంకేత భాషలు కూడా అంతే వైవిధ్యంగా ఉంటాయి. వినికిడి లోపం ఉన్న వ్యక్తులు తమ సంస్కృతి, సంప్రదాయాలు, అనుభవాలను ఈ భాష ద్వారానే తరతరాలకు అందిస్తున్నారు. అందువల్ల సంకేత భాషను ఒక సంపూర్ణ భాషగా గుర్తించడం అత్యంత అవసరం.

సమాజంలో చాలామంది వినికిడి లోపం ఉన్న వ్యక్తులు ఎదుర్కొనే ఇబ్బందులను పూర్తిగా అర్థం చేసుకోలేరు. సాధారణ సంభాషణల నుంచి ప్రభుత్వ సేవల వరకు అనేక రంగాల్లో వారు అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. తమ అవసరాలను వివరించడానికి లేదా ఇతరుల మాటలను అర్థం చేసుకోవడానికి మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సంకేత భాషకు విస్తృత గుర్తింపు లభిస్తే ఈ సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే సంకేత భాషలను సామాజిక హక్కుల భాగంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. విద్యా రంగంలో సంకేత భాష పాత్ర అత్యంత కీలకం. వినికిడి లోపం ఉన్న చిన్నారులు చిన్న వయస్సులోనే సంకేత భాషను నేర్చుకుంటే వారి మేధో వికాసం వేగంగా జరుగుతుంది. పాఠశాలల్లో సంకేత భాష తెలిసిన ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు పాఠాలను సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ఈ సదుపాయాలు పరిమితంగానే ఉన్నాయి. ఫలితంగా ఎంతో ప్రతిభ ఉన్న విద్యార్థులు కూడా విద్యలో వెనుకబడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చడానికి ప్రత్యేక చర్యలు అవసరం.

ఉపాధి రంగంలో కూడా సంకేత భాష ప్రాధాన్యం రోజురోజుకు పెరుగుతోంది. కార్యాలయాలు, పరిశ్రమలు, సేవా రంగాల్లో వినికిడి లోపం ఉన్నవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటే అనుకూల వాతావరణం అవసరం. సంకేత భాష తెలిసిన సిబ్బంది, అనువాదకులు, సాంకేతిక సాధనాలు అందుబాటులో ఉంటే వారు మరింత సమర్థంగా పనిచేయగలుగుతారు. ప్రతిభకు అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్వావలంబనను కూడా పెంచవచ్చు. ఆరోగ్య రంగంలో సంకేత భాష అవసరం మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఆసుపత్రులకు వచ్చిన వినికిడి లోపం ఉన్న వ్యక్తులు తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు వివరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారు. వైద్యుల సూచనలను అర్థం చేసుకోవడంలో కూడా సమస్యలు తలెత్తుతాయి. సంకేత భాష అనువాదకులు అందుబాటులో ఉంటే వైద్య సేవలు మరింత సమర్థవంతంగా అందించవచ్చు. ఇది రోగుల భద్రతను కూడా పెంచుతుంది.

ప్రభుత్వ సేవలు, న్యాయ వ్యవస్థ, అత్యవసర సేవల్లో సంకేత భాషకు ప్రత్యేక స్థానం కల్పించాల్సిన అవసరం ఉంది. పోలీసు శాఖలు, న్యాయస్థానాలు, విపత్తు నిర్వహణ వ్యవస్థల్లో సంకేత భాష సేవలు అందుబాటులో ఉంటే వినికిడి లోపం ఉన్న వ్యక్తులు కూడా సమానంగా సేవలు పొందగలుగుతారు. ఇది రాజ్యాంగం కల్పించిన సమాన హక్కుల అమలుకు దోహదపడుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు ఉండాలంటే ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి సంకేత భాషలకు కొత్త అవకాశాలను తెరుస్తోంది. దృశ్య ఆధారిత అనువర్తనాలు, కృత్రిమ మేధ ఆధారిత అనువాద వ్యవస్థలు, ఆన్‌లైన్ శిక్షణ వేదికలు సంకేత భాష అభ్యాసాన్ని మరింత సులభతరం చేస్తున్నాయి. సామాజిక మాధ్యమాలు కూడా సంకేత భాషపై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. భవిష్యత్తులో సాంకేతికత సహకారంతో మరింత మంది ఈ భాషను నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి.

సంకేత భాషలను గౌరవించడం అనేది కేవలం వినికిడి లోపం ఉన్న వ్యక్తులను గౌరవించడం మాత్రమే కాదు. అది సమాజంలోని వైవిధ్యాన్ని అంగీకరించడం కూడా. ప్రతి వ్యక్తి తన భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరచుకునే హక్కు కలిగి ఉంటాడు. ఆ హక్కును ఆచరణలోకి తీసుకురావడంలో సంకేత భాషలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అందుకే ఈ భాషలను ప్రోత్సహించడం సమాజం మొత్తం బాధ్యతగా భావించాలి. అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. సంభాషణకు అడ్డంకులు లేకుండా ప్రతి వ్యక్తికి సమాన అవకాశాలు కల్పించే సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యాన్ని ఇది గుర్తు చేస్తోంది. సంకేత భాషలకు మరింత గుర్తింపు, ప్రోత్సాహం, వనరులు అందించినప్పుడే వినికిడి లోపం ఉన్న వ్యక్తులు తమ పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించగలుగుతారు. సమానత్వం, గౌరవం, భాగస్వామ్యం అనే విలువలను బలోపేతం చేసే దిశగా ఈ దినోత్సవం ప్రపంచ సమాజాన్ని ముందుకు నడిపిస్తోంది.

# రామమందిర విరాళాల వ్యవహారం పై దర్యాప్తు

- నగదు లెక్కింపులో 105 అనుమానాస్పద ఘటనలు
- ఎనిమిది మంది పాత్రపై సిట్ విచారణ
- వెండి, విలువైన వస్తువుల్లో తేడాలు లేవని నివేదిక



**అయోధ్య, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల నిర్వహణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం కీలక విషయాలను గుర్తించింది. ఆలయంలోని నగదు లెక్కింపు గది నుంచి డబ్బును అనధికారికంగా తరలించడం లేదా దాచిపెట్టినట్లు భావిస్తున్న 105 ఘటనలను గుర్తించినట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను సుప్రీం కోర్టు ధర్మాసనం పరిశీలించింది. నగదు వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతుండగా, విలువైన వెండి వస్తువులు, ఇతర విరాళాల విషయంలో మాత్రం ఎలాంటి వ్యత్యాసాలు గుర్తించలేదని నివేదిక వెల్లడించింది. యాత్రికుల సౌకర్య కేంద్రంలోని నగదు లెక్కింపు గది, సీసీటీవీ దృశ్యాలు, డిజిటల్ ఆధారాలను సిట్ సమగ్రంగా పరిశీలించింది. ఈ పరిశీలనలో నగదు లెక్కింపు ప్రక్రియ సమయంలోనే అనధికారికంగా డబ్బు తరలింపు లేదా దాచివేత జరిగినట్లు అనుమానిస్తున్న 105 సందర్భాలు బయటపడ్డాయి. ఈ ఘటనల్లో నగదు లెక్కింపులో పాల్గొన్న కొందరు వ్యక్తుల సహకారం కూడా ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు సూచిస్తున్నాయని సిట్ తెలిపింది. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను గుర్తించినట్లు దర్యాప్తు బృందం వెల్లడించింది. వారి బ్యాంకు ఖాతాల్లో జరిగిన లావాదేవీలు, వివరణ లేని నగదు జమలు, అనుమానాస్పద పెట్టుబడులు, స్థిరాస్తులు, చరాస్తుల వివరాలను అధికారులు సేకరించారు. ప్రతి నిందితుడి పాత్రను విడివిడిగా విశ్లేషిస్తూ, ఎంత మొత్తం దుర్వినియోగానికి గురై ఉండొచ్చన్న అంశాన్ని కూడా నివేదికలో పొందుపరిచినట్లు వెల్లడైంది. అక్రమంగా మళ్లించినట్లు అనుమానిస్తున్న నగదు ఎక్కడికి వెళ్లిందనే దానిపై కూడా సిట్ దృష్టి సారించింది. సంబంధిత వ్యక్తులను గుర్తించడం, వారిని విచారించడం, ఆర్థిక ఆధారాలను సేకరించడం వంటి చర్యలు కొనసాగుతున్నాయి. బ్యాంకు రికార్డులు, విరాళాల లెక్కలు, ఎలక్ట్రానిక్ డేటా, ఇతర ఆర్థిక పత్రాలను పరస్పరం సరిపోల్చి పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు 173 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు సిట్ తెలిపింది. దర్యాప్తులో భాగంగా రామమందిర ట్రస్ట్ వద్ద ఉన్న విలువైన వస్తువులను కూడా అధికారులు తనిఖీ చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరిచిన 803 విలువైన వస్తువులను భౌతికంగా పరిశీలించగా, వాటికి సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. రసీదులు జారీ చేయని మరో 86 విలువైన వస్తువులను కూడా పరిశీలించినప్పటికీ ఎలాంటి వ్యత్యాసాలు కనిపించలేదని నివేదిక స్పష్టం చేసింది. ట్రస్ట్ వద్ద ఉన్న సుమారు 944.411 కిలోల వెండి నిల్వలు, వెండి ఇటుకలు, వెండి హారం, చరణ్ పాదుకలు తదితర విరాళాలకు సంబంధించిన రికార్డులను కూడా సిట్ పరిశీలించింది. వీటి నిర్వహణలో ఎలాంటి అక్రమాలు లేదా లెక్కల తేడాలు లేవని అధికారులు నిర్ధారించారు. ఉత్తరప్రదేశ్ పోలీస్ ఐజీ కిరణ్ ఎస్ నేతృత్వంలో దర్యాప్తు కొనసాగుతుండగా, సెప్టెంబర్ 25లోపు తొలి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయనున్నట్లు సుప్రీం కోర్టుకు సమాచారం అందింది.

# కావేరి జల వివాదంపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

- థర్డ్ పార్టీ పిటిషన్‌కు నిరాకరణ
- రాష్ట్రాలకే వాదించే హక్కు ఉందన్న ధర్మాసనం
- కొనసాగుతున్న కర్ణాటక–తమిళనాడు న్యాయపోరాటం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు)** కావేరి నదీ జలాల వివాదంలో మూడో పక్షాలు లేదా ప్రైవేట్ సంస్థలు జోక్యం చేసుకోలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కర్ణాటకకు అదనంగా 70 టీఎంసీల కావేరి జలాలను కేటాయించాలని కోరుతూ ఒక ప్రైవేట్ సొసైటీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను ధర్మాసనం కొట్టివేసింది. అంతర్రాష్ట్ర జల వివాదాలు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరిష్కరించాల్సిన అంశాలని, ఇలాంటి వ్యవహారాల్లో ప్రైవేట్ సంస్థలకు స్థానం లేదని న్యాయస్థానం పేర్కొంది. కావేరి జలాల పంపిణీపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య ఇప్పటికే న్యాయపరమైన పోరాటం కొనసాగుతోందని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. ఇలాంటి సమయంలో మూడో పక్షాల పిటిషన్లను స్వీకరిస్తూ పోతే వివాదాలు ఎన్నటికీ ముగియవని వ్యాఖ్యానించింది. నదీ జలాల కేటాయింపుల విషయంలో మాట్లాడే హక్కు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని ధర్మాసనం పునరుద్ఘాటించింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కేసుల నేపథ్యంలో కొత్త వ్యాజ్యాలకు అవకాశం లేదని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, తమిళనాడుకు నీటి విడుదల అంశంపై కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే సుప్రీంకోర్టులో తన వాదనలను వినిపించింది. ఆగస్టు 31 నాటికి నిర్దేశించిన పరిమాణం కంటే ఎక్కువ నీటిని విడుదల చేసినట్లు కర్ణాటక తెలిపింది. కావేరి జల నిర్వహణ అథారిటీ ఆదేశాలను అమలు చేస్తూ తమిళనాడు వైపు 9,000 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొంది. ఆగస్టు 25న జరిగిన సమావేశంలో 15 రోజుల పాటు ఈ ప్రవాహాన్ని కొనసాగించాలని అథారిటీ నిర్ణయించింది. మరోవైపు, తమకు రావాల్సిన నీటి వాటాలో లోటు ఏర్పడిందని తమిళనాడు ప్రభుత్వం వాదిస్తోంది. నీటి బకాయిల అంశాన్ని కావేరి జల నిర్వహణ అథారిటీ దృష్టికి తీసుకెళ్లినా, దానిపై ప్రత్యేక ఆదేశాలు వెలువడలేదని తమిళనాడు తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా తమకు రావాల్సిన నీటిని వెంటనే విడుదల చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సెప్టెంబర్ 18న కూడా తమిళనాడు ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించి నీటి విడుదలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది. మేట్టూరు జలాశయంలో ఉన్న నిల్వలు కేవలం పరిమిత కాలానికే సరిపోతాయని, సాగు మరియు తాగునీటి అవసరాలు దృష్ట్యా తక్షణ చర్యలు అవసరమని తెలిపింది. ఈ నేపథ్యంలో కావేరి జలాల పంపిణీ అంశం మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. కావేరి వివాదానికి చారిత్రక నేపథ్యం ఉంది. బ్రిటీష్ పాలన కాలంలో 1892, 1924 సంవత్సరాల్లో జరిగిన ఒప్పందాల నుంచి ఈ వివాదం ప్రారంభమైంది. 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరి జల వివాద ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయగా, 2007లో తుది తీర్పు వెలువడింది. అనంతరం ఇరు రాష్ట్రాల అభ్యంతరాలతో వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో అంతర్రాష్ట్ర నదులు ఏ ఒక్క రాష్ట్రానికి చెందినవి కావని, అవి జాతీయ వనరులని స్పష్టం చేసింది.

# శ్రీపతిపల్లి పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



- మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన టాస్క్‌ఫోర్స్
- వంటగది, భోజనశాలలో పరిశుభ్రతపై ఆరా
- ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశం

**చిల్పూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** చిల్పూర్ మండలంలోని శ్రీపతిపల్లి ప్రభుత్వ పాఠశాలలో డివిజన్ స్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారి బి. రవీందర్ ఆధ్వర్యంలోని బృందం సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించింది. పాఠశాలకు చేరుకున్న అధికారులు ముందుగా వంటగదిని పరిశీలించి అక్కడి పరిశుభ్రత, బియ్యం, పప్పు నిల్వలు, వంట సామగ్రి తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం పాఠశాలలో నూతనంగా నిర్మించిన భోజనశాలను పరిశీలించారు. భోజనశాల నిర్మాణానికి సంబంధించిన వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు వడ్డించిన అన్నం, పప్పు, సాంబారు రుచి, నాణ్యతను అధికారులు స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? ప్రతిరోజూ గుడ్డు, కూరగాయలు అందుతున్నాయా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.మధ్యాహ్న భోజన సిబ్బంది, ఉపాధ్యాయులతో మాట్లాడిన అధికారులు ప్రభుత్వ మెనూను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు.

భోజనానికి ముందు విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కుంటున్నారా? అనే విషయాన్ని కూడా పరిశీలించారు. పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మధ్యాహ్న భోజన పథకం ఇన్‌చార్జి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరుపుకుందాం

- తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం హనుమకొండ జిల్లా ఇంచార్జ్ సందెల రాజు



**హనుమకొండ, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** గణేష్ నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో పాటు పూర్తిగా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం హనుమకొండ జిల్లా ఇంచార్జ్ సందెల రాజు పిలుపునిచ్చారు. గణేష్ ఉత్సవాలు భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం చాటేలా సాగాలని ఆకాంక్షించారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రలో మండపాల నిర్వాహకులు, యువత, భక్తులు సంయమనం పాటించాలని కోరారు. పోలీసు, మున్సిపల్ అధికారులు సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటిస్తూ అధికారులకు సహకరించాలని సూచించారు. శోభాయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా, ప్రజల రాకపోకలకు అంతరాయం లేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో నిమజ్జనోత్సవం విజయవంతంగా పూర్తయ్యేలా ప్రజలందరూ పరస్పరం సహకరించుకోవాలని సందెల రాజు కోరారు. మత సామరస్యం, సోదర భావం కాపాడుతూ భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనాన్ని నిర్వహించి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.

# 15వ వార్డు అధ్యక్షుడిగా ఆదిమల్ల చింతాల్ ఏకగ్రీవం



**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వార్డు అధ్యక్షుడిగా ఆదిమల్ల చింతాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సైతం నియమించారు.

ఈ సందర్భంగా నూతన వార్డు అధ్యక్షుడు ఆదిమల్ల చింతాల్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, కౌన్సిలర్ బొల్లు లక్ష్మి, 15వ వార్డు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వార్డులో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చింతాల్ తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

# ఎంజీఎం సమస్యలపై గళమెత్తిన వినయ్ భాస్కర్..

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటనలో వినయ్ భాస్కర్ కాలు, చేతికి గాయాలై రక్తస్రావం జరిగినట్లు ఆయన అనుచరులు తెలిపారు.ఇటీవల ఎంజీఎం ఆస్పత్రిలో పైకప్పు పెచ్చులు ఊడిపడి రోగులు గాయపడిన ఘటనల నేపథ్యంలో ఆస్పత్రి పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు వినయ్ భాస్కర్ అక్కడికి వెళ్లారు. మంగళవారం మరోసారి ఆస్పత్రిలోని కొన్ని విభాగాల్లో పైకప్పు భాగాలు ఊడిపడినట్లు సమాచారం రావడంతో ఆయన ఆస్పత్రికి చేరుకున్నారు. రోగుల భద్రత, ఆస్పత్రిలోని మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చిన ఆయనను ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు.

దీంతో బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగాయి. 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేయడంతో ఎంజీఎం పరిసరాల్లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం వినయ్ భాస్కర్ ఆస్పత్రి ప్రాంగణంలోకి వెళ్లి పరిస్థితులను పరిశీలించారు.



### ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకే వెళ్లాను: వినయ్ భాస్కర్

ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఎంజీఎం ఆస్పత్రిలో పేద రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకే తాను ఆస్పత్రికి వచ్చానని తెలిపారు. రోగులకు సరిపడా పడకలు, వైద్య సదుపాయాలు, భవనాల భద్రత, అంబులెన్సుల కొరత వంటి సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను పరిశీలించేందుకు వచ్చిన తనను ఆస్పత్రిలోకి అనుమతించకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. ఎంజీఎం సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి రోగులకు మెరుగైన వైద్యం, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

### వినయ్ భాస్కర్‌కు బీఆర్ఎస్ మద్దతు

ఎంజీఎం ఆస్పత్రిలోని సమస్యలను పరిశీలించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడాన్ని బీఆర్ఎస్ నాయకత్వం ఖండించింది. ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడం, వాటిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొంది.వినయ్ భాస్కర్‌కు గాయాలైన ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ప్రజా సమస్యలపై ప్రశ్నించే నాయకులు, ప్రజాప్రతినిధులతో పోలీసులు సంయమనంతో వ్యవహరించాలని కోరింది.

ఎంజీఎం ఆస్పత్రి భవనాల పరిస్థితి, రోగుల భద్రత, వైద్య సదుపాయాలపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్న ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని కోరింది. ప్రజల ఆరోగ్యం, రోగుల భద్రతకు సంబంధించిన సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే తన లక్ష్యమని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. ఎంజీఎం ఆస్పత్రి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

# 14వ వార్డు రైల్వే కాలనీలో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు

- 41 రకాల నైవేద్యాలతో గణనాథుడికి మహాపూజ
- లంబోదరుడికి ఇష్టమైన ప్రసాదాలతో భక్తిశ్రద్ధలు



**స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు రైల్వే కాలనీలో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో మంగళవారం భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. మండపం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడికి 41 రకాల నైవేద్యాలను సమర్పించారు.

లంబోదరుడికి ఇష్టమైన లడ్డూలు, ఉండ్రాళ్లు, పులిహోర, అన్నం, పాయసం, పండ్లు, వడపప్పు, చలిమిడి తదితర 41 రకాల ప్రసాదాలను స్వామివారి సన్నిధిలో ఉంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వివిధ రకాల నైవేద్యాలతో మండపం ప్రత్యేక ఆకర్షణగా మారింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజించారు.

చాగల్లు మహా అన్నదానం

స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్లు ప్రాంతంలో మార్కండేయ పద్మశాలి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపంలో 8వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేష్, రజిత ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మండపం పరిసర ప్రాంతం సందడిగా మారింది. భజనలు, భక్తుల సందడితో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ అనిల్ గౌడ్, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడకమ్మా.. అండగా ఉంటా

- అగ్ని ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులాలికి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి భరోసా
- రూ.20వేల తక్షణ ఆర్థిక సాయం అందజేత, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ఆర్డీవోకు ఆదేశాలు





**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 22(తెలంగాణ ముచ్చట్లు ):** పాల్వంచ మండలంలోని కరకవాగు ప్రాంతానికి చెందిన ఎండీ. ముబీన్ నివాస గృహం ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులు రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కొత్తగూడెంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి.. తమ గోడును వెల్లబోసుకున్నారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి పొంగులేటి.. రూ.20 వేలను తక్షణ సాయంగా వారికి అందజేశారు. అలాగే... ఈ కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని ఆర్డీవోను ఆదేశించారు. అధైర్య పడవద్దని.. ఒక అన్న లాగా మీ కుటుంబానికి అండగా నిలుస్తానని.. మంత్రి పొంగులేటి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు.. రెవెన్యూ మంత్రి పొంగులేటికి మనసారా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ల మురళి, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి





- శ్రీనివాస్‌కు నివాళులర్పించిన టీఎంజెఎఫ్ నాయకులు
- కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు సంక్షేమ పథకాలు అందించాలి
- టిఎంజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ విజ్ఞప్తి

**జడ్చర్ల, సెప్టెంబర్ 22 (తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దింటి శ్రీనివాస్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన మృతి పట్ల తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం నాయకులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ స్వగ్రామమైన జడ్చర్ల మండలం నసురుల్లాబాద్‌కు చేరుకున్న టీఎంజెఎఫ్ నాయకులు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాట్లాడుతూ జర్నలిస్ట్ పెద్దింటి శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టు కుటుంబం ఆపదలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేకంగా స్పందించి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీనివాస్ కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కుటుంబానికి అండగా నిలవడంతో పాటు అర్హతకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించాలని కోరారు. జర్నలిస్టు కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.పెద్దింటి శ్రీనివాస్ మృతి జర్నలిస్టు వర్గానికి తీరని లోటని నాగేందర్ అన్నారు. జర్నలిజం రంగంలో శ్రీనివాస్ అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయన కుటుంబానికి టీఎంజెఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్,కోశాధికారి బొట్ల సదానందం, గౌరవ సలహాదారులు ప్రేమన్న,ఉపాధ్యక్షులు పానుగంటి సురేందర్,అధికార ప్రతినిధి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in